సాక్షి రాజన్న సిరిసిల్ల

ఆదివారం । 24 । సెప్టెంబర్ । 2023

మంత్రి కేటీఆర్‌ను కలిసిన నాయకులు

ముస్తాబాద్(సిరిసిల్ల): హైదరాబాద్ ప్రగతిభవన్‌లో మంత్రి కేటీఆర్‌ను ఆవునూరు రజక సంఘం నాయకులు శనివారం కలిశారు. చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణకు రావాలని ఆహ్వానపత్రికను అందించినట్లు రజక సంఘం అధ్యక్షుడు నక్కదాసరి రవి తెలిపారు. ఇప్పటికే మంత్రి కేటీఆర్ మంజూరు చేసిన నిధులతో రజక సంఘం భవనాన్ని నిర్మించుకున్నామని తెలిపారు. శ్రీకాంత్, అశోక్, శ్యామ్, పర్శరాం తదితరులున్నారు.



న్యూస్‌రీల్

వేస్ట్ టు వండర్ విజయవంతం చేయండి



వేములవాడ: ఐఎస్ఎల్ 2.0 ఇండియన్ స్వచ్ఛత లీగ్ సెషన్– 2 స్వచ్ఛహిత సేవ విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కమిషనర్ అన్వేశ్ కోరారు. వేస్ట్ టు వండర్ కాంపిటీషన్ కరపత్రాన్ని శనివారం విడుదల చేసిన సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమం ఉద్దేశం ప్రజలకు తెలియజేయాలన్నారు. ఇంట్లోని వేస్ట్ ప్లాస్టిక్, కార్డ్‌బోర్డ్స్, టైర్ల నుంచి డెకరేటీవ్ వస్తువులు చేసి మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 30లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. విజేతలకు అక్టోబర్ 2న బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. మేనేజర్ సంపత్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, సిస్టమ్ మేనేజర్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

సామాజిక సేవలో ముందుండాలి



వేములవాడఅర్బన్: విద్యార్థులు సామాజిక సేవ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్ కోరారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జాతీయ సేవా పథకం యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవ, హరితహారం కార్యక్రమాలు శనివారం చేపట్టారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు తిరుకోవెల శ్రీనివాస్, రమాదేవి, ప్రేమ్‌కుమార్, వెంకటేశ్వర్లు, మధు రాజేశ్, అఫ్సారీ ఉస్మాని, మల్లారెడ్డి, రాజేశ్, శ్రీనివాసులు, ప్రభాకర్, నారాయణ ఉన్నారు.

ఓటింగ్ శాతాన్ని పెంచాలి



సిరిసిల్ల: ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు అందరూ కృషి చేయాలని డీఆర్‌డీవో నక్క శ్రీనివాస్ కోరారు. కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ ఆఫీస్‌లో శనివారం స్వీప్‌పై అవగాహన కల్పించారు. ఓటు ఆవశ్యకతను గుర్తించాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని, ఓటు వేసేలా చైతన్యవంతులను చేయాలన్నారు. అదనపు డీఆర్‌డీవోలు మదన్‌మోహన్, రవి కుమార్, స్వీప్ నోడల్ అధికారి నర్సింహులు, ఏపీవో అయిలినేని పాపారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫైనాన్షియల్ ఎంటర్‌ప్రైజ్ వర్క్‌షాప్

సిరిసిల్లఅర్బన్: స్థానిక బాలుర జిల్లా పరిషత్ పాఠశాలలో అమెరికన్ ఇండియా ఫౌండేషన్ స్కిల్ బ్రిడ్జ్ ప్రోగ్రాం ఆధ్వర్యంలో శనివారం ఫైనాన్షియల్ ఎంటర్‌ప్రైజ్ వర్క్‌షాప్ నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన ఆర్థిక అక్షరాస్యత, స్టెమ్‌కోడింగ్‌లను ప్రదర్శించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డీఈవో రమేశ్ కుమార్ సర్టిఫికెట్స్ అందజేశారు. హెచ్‌ఎంలు శ్రీనివాస్, ఫౌండేషన్ సభ్యులు శ్రుతి, ప్రాజెక్ట్ మేనేజర్ నఫీస్ అహ్మద్, మహేందర్, మహేశ్, శైలజ, స్వప్న, క్రాంతి ఉన్నారు.

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని మండెపల్లి మోడల్‌స్కూల్‌ను డీఈవో రమేశ్‌కుమార్ సందర్శించారు. స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే ప్రాక్టీస్ పరీక్షను పరిశీలించారు.

జేఏసీ విజయోత్సవం



వేములవాడ: రాజన్న ఖాతా నుంచి కామారెడ్డి ప్రాంతంలోని ఆలయాలకు రూ.5 కోట్లు మళ్లించేందుకు రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేయడంతో అఖిలపక్ష నాయకులు, జేఏసీ నాయకులు వ్యతిరేకిస్తూ శనివారం వేములవాడ బంద్‌కు పిలుపునిచ్చారు. స్పందించిన మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే రమేశ్‌బాబు అప్పటికప్పుడు నిధుల మళ్లింపును నిలుపుదల చేసి రూ.5 కోట్ల సీజీఎఫ్ నిధులు కేటాయించాలని ఉత్తర్వులు వెల్లడించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ శనివారం రాజన్న గుడి ముందు విజయోత్సవం నిర్వహించారు. జేఏసీ నాయకులు నేరెళ్ల తిరుమల్‌గౌడ్, బొజ్జ కనకయ్య, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, టీడీపీ నాయకులు పులి రాంబాబు, సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు క దారి రాములు, సీపీఎం నాయకులు అశోక్, బీఎస్పీ నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

సండే స్పెషల్

కూతురు.. ఇంటికి వెలుతురు

కూతురు భారం కాదు.. ఆమెను ప్రోత్సహిస్తే కుటుంబానికి అండగా నిలుస్తూ ఇంటికి వెలుతురునిస్తుంది. ఇంట్లో ఆడపిల్ల పుట్టగానే బరువు అనుకునేవారికి ఆ భావన తప్పు అని నిరూపిస్తున్నారు నేటి బాలికలు. కళలు, క్రీడలు, చదువులు, ఉద్యోగాల్లో రాణిస్తూ మగవాళ్లకు తామేమీ తీసిపోమని నిరూపిస్తున్నారు. తల్లిదండ్రులకు తమను చూసుకునే కొడుకుల్లేరనే బాధను మర్చిపోయేలా చేస్తున్నారు. వారి ఆశలను తీరుస్తూ.. కలలను నిజం చేస్తూ ఇంట్లో ఆనందాన్ని పంచుతున్నారు. నేడు అంతర్జాతీయ కూతుళ్ల దినోత్సవం. ఈ సందర్భంగా పలువురు తమ మనోభావాలను 'సాక్షి'తో పంచుకున్నారు.





చెల్లెళ్లతో కోరుట్ల ఏవో నాగమణి (మధ్యలో)

- ఆడపిల్ల భారం కాదు.. ప్రోత్సహిస్తే అండగా నిలుస్తుంది
- కళలు, క్రీడలు, చదువులు, ఉద్యోగాల్లో రాణిస్తున్న పలువురు
- నేడు అంతర్జాతీయ కూతుళ్ల దినోత్సవం

ముగ్గురూ ఉద్యోగులే



కూతుళ్లతో కిష్టయ్య–సత్తమ్మ దంపతులు

కథలాపూర్(వేములవాడ): మెట్‌పల్లి మండలంలోని జగ్గాసాగర్ గ్రామానికి చెందిన మండల కిష్టయ్య–సత్తమ్మ దంపతులకు ముగ్గురు కూతుళ్లు సరిత, సవిత, కీర్తి ఉన్నారు. వ్యవసాయం, కూలీ పనులు చేస్తూ పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. సరిత పీజీ, బీఈడీ పూర్తి చేసి, పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం సాధించి, ఇబ్రహీంపట్నం మండలంలో విధులు నిర్వహిస్తోంది. సవిత డిగ్రీ పూర్తి చేసి, ప్రైవేట్ టీచర్‌గా పని చేస్తోంది. కీర్తి 2020లో పోలీస్‌శాఖలో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి, కథలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తోంది. తాము కూతుళ్లనే కొడుకులు భావించి, ఉన్నత చదువులు చదివించామని, వారు కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించడంతో తమ కల నెరవేరిందని ఆ దంపతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కష్టపడి లక్ష్యాన్ని చేరుకున్నా



జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: మాది ప్రకాశం జిల్లా. నేను హైదరాబాద్‌లో పుట్టి, పెరిగాను. మేం నలుగురు అక్కాచెల్లెల్లం. నాన్న షేక్ యూసుఫ్ పాషా ఎక్స్ సర్వీస్‌మెన్, తల్లి షబీరా హౌస్ వైఫ్. నలుగురు కూతుళ్లలో నేనే పెద్దదాన్ని. 2003లో గ్రూప్–1 రాసి, ఎంపీడీవోగా, 2009లోనూ రాసి, డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యాను. 2011లో మహబూబ్‌నగర్‌లో ఉద్యోగ బాధ్యతలు చేపట్టాను. 2016లో రాజన్న సిరిసిల్ల జిల్లాకు జాయింట్ కలెక్టర్‌గా వచ్చాను. 2020లో వనపర్తికి కలెక్టర్‌గా వెళ్లాను. 1 ఫిబ్రవరి 2023న జగిత్యాల కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టాను. పెళ్లి జరిగి, ఇద్దరు పిల్లలు పుట్టాక ఇంటి వద్దే ఉంటూ వంట చేయడం, పిల్లలను చూసుకోవడం వంటివే జీవితం అనుకోలేదు. కష్టపడి చదివి, లక్ష్యాన్ని చేరుకున్నాను. పెద్ద చెల్లెలు నజీబీ లండన్‌లో స్థిరపడగా, రెండో చెల్లెలు పర్వీన్ టీఎస్ఎస్‌లో మంచి పొజిషన్‌లో ఉంది. చిన్న చెల్లెలు బీఫార్మసీ పూర్తి చేసి, ఉద్యోగం చేస్తోంది. మా అమ్మానాన్న వారికి అందరూ ఆడపిల్లలే అని బాధ పడలేదు. చదువుల్లో ప్రోత్సహిస్తూ మా వెన్నంటి ఉన్నారు. వారి వల్లే మేము ఈ పొజిషన్‌లో ఉన్నాం. తల్లిదండ్రులను ఎప్పుడూ గౌరవించాలి.

మా కల నిజం చేసింది



కూతురు శివానితో టీచర్ కుమ్మరి మల్లేశం

సిరిసిల్లకల్చరల్: మాది సిరిసిల్ల. మా అమ్మాయి శివాని పదోతరగతి నుంచి చదువుల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ చాటుతూ ముందుకు సాగింది. పదోతరగతిలో జిల్లా టాపర్‌గా నిలిచింది. ఇంటర్మీడియట్‌లో 968 మార్కులు సాధించింది. బీటెక్ ఈసీఈ పూర్తి చేసి, ప్రస్తుతం ఓ కంపెనీలో ఏడాదికి రూ.32 లక్షల ప్యాకేజీతో సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగిగా పని చేస్తోంది. అమ్మాయి మా కల నిజం చేసినందుకు సంతోషంగా ఉంది.

పేద కుటుంబంలో పుట్టాం



అక్క, చెల్లెలితో అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లిరూరల్: మాది జగిత్యాల జిల్లా కొడిమ్యాల. మేం ముగ్గురు అక్కాచెల్లెళ్లం. పేద కుటుంబంలో పుట్టాం. అమ్మానాన్న జడల రామస్వామి, లక్ష్మి. నాన్న ఇంటివద్దే దుస్తులు అమ్మి, కుటుంబాన్ని పోషించారు. ప్రభుత్వ విద్యాలయాల్లోనే చదువుకున్నాం. ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో ఉన్న మమ్మల్ని అమ్మానాన్న ప్రోత్సహించారు. అక్క రాజమణి ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చదివి, ప్రభుత్వ టీచర్‌గా కరీంనగర్‌లో పని చేస్తోంది. నేను 2012లో ఐఏఎస్ సాధించా. పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్‌గా పని చేస్తున్న. నా భర్త శ్రీనివాస్ ప్రభుత్వ టీచర్. మాకు ఇద్దరు అఖిలన్, అభిషన్ సంతానం. చెల్లెలు జ్యోతి ఎం.కాం చదివి, హైదరాబాద్‌లో బ్యాంకింగ్ రంగంలో అకౌంట్స్ ఆఫీసర్‌గా పని చేస్తోంది. 4 మాసాల క్రితం నాన్న చనిపోవడం తీరని బాధను మిగిల్చింది.

అమ్మ గర్వపడుతోంది

కోరుట్ల రూరల్: మా స్వగ్రామం మేడిపల్లి మండలంలోని తొంబర్‌రావు పేట. ప్రస్తుతం కోరుట్లలో స్థిరపడ్డాం. మేము ముగ్గురం అక్కాచెల్లెళ్లం. నాన్న బుచ్చిలింగం గల్ఫ్ కార్మికుడు, అమ్మ లక్ష్మి బీడీ కార్మికురాలు. పిల్లలు ఆడవాళ్లనే భావన ఎప్పుడూ వారిలో చూడలేదు. అందరినీ ఉన్నత చదువులు చదివించారు. నేను బీఎస్సీ అగ్రికల్చర్ చదివి, వ్యవసాయ అధికారి ఉద్యోగం సాధించాను. చెల్లెళ్లు విశాల, రమ్య పీజీ పూర్తి చేసి, ప్రస్తుతం ప్రైవేటు ఉద్యోగం చేస్తూ ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రయత్నిస్తున్నారు. నాన్న గల్ఫ్ నుంచి వచ్చి, అనారోగ్యం బారిన పడినా అమ్మ బీడీలు చుట్టి, మా చదువులు పూర్తి చేయించింది. ప్రస్తుతం ప్రయోజకులుగా మారిన మమ్మల్ని చూసి, అమ్మ గర్వపడుతోంది.

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి



సమావేశానికి హాజరైన అధికారులు

- ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో ఎన్నికలుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి శనివారం సెక్టార్ అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించాలన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలన్నారు. సెక్టార్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి మంచినీరు, విద్యుత్, మరుగుదొడ్లు, దివ్యాంగుల కోసం ర్యాంపులు ఉండేలా చూడాలన్నారు. వసతులు లేకుంటే నివేదించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలు గ్రౌండ్‌ఫ్లోర్‌లోనే ఉండాలని స్పష్టం చేశారు. పోలీసు అధికారులు కూడా పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని సూచించారు. వారం రోజుల్లో సెక్టార్ అధికారులకు శిక్షణ ఇస్తామని, సామగ్రి అందిస్తామని తెలిపారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి పనిచేయాలని, క్రమశిక్షణతో సమర్థంగా ఎన్నికల నిర్వహణలో భాగస్వాములు కావాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా పనిచేయాలని క్షేత్రస్థాయిలో పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, ఆర్డీవోలు ఎన్.ఆనంద్ కుమార్, మధుసూదన్, డీఎస్పీ నాగేంద్రచారి పాల్గొన్నారు.

నిమజ్జనం ప్రశాంతంగా చేసుకోవాలి

- వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి



మంటప నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎస్పీ నాగేంద్రచారి

వేములవాడరూరల్: వినాయక నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి కోరారు. వేములవాడ రూరల్ మండల గణేశ్ మంటప నిర్వాహకులు, ప్రజాప్రతినిధులతో శనివారం సమావేశమయ్యారు. డీఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూ నిర్వాహకులు తమకు ఇచ్చిన సమయంలోపే నిమజ్జనం పూర్తి చేయాలని సూచించారు. మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 12 గంటల వరకు ఉత్సవాలు చేసుకోవాలన్నారు. డీజేలు రెండు బాక్సులు మాత్రమే పెట్టుకోవాలని, మద్యం సేవించకుండా భక్తిభావంతో పండుగ జరుపుకోవాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేములవాడ రూరల్ సీఐ కృష్ణకుమార్, ఎస్సై మారుతి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, యామ తిరుపతి, జక్కుల తిరుపతి, గోస్కుల రవితోపాటు వేములవాడ రూరల్ మండలానికి చెందిన మంటప నిర్వాహకులు హాజరయ్యారు.

వీటీడీఏ సెక్రటరీ సమ్మయ్య బదిలీ



సమ్మయ్య

వేములవాడ: వీటీడీఏ సెక్రటరీ వి.సమ్మయ్యను తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ శనివారం ఉత్తర్వులు వెల్లడించారు. వేములవాడలో వీటీడీఏ కార్యాలయం ప్రారంభంకాకముందే సమ్మయ్య బదిలీపై వెళ్లడం చర్చనీయాంశమైంది.

ఆందోళన.. అయోమయం

- గ్రూప్–1 పరీక్ష రద్దు చేయాలన్న హైకోర్టు
- నిరాశలో నిరుద్యోగులు
- టీఎస్‌పీఎస్సీ రద్దుకు డిమాండ్
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆగ్రహం



సిరిసిల్లఎడ్యుకేషన్: గ్రూప్–1 పరీక్ష రెండోసారి సైతం రద్దు కావడంతో నిరుద్యోగ యువత ఆందోళన చెందుతుంది. ఏళ్లకేళ్లు తమ కలల సాధన కోసం కష్టపడి చదివితే ప్రభుత్వ నిర్లక్ష్యానికి బలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఒకసారి పరీక్ష రద్దు కాగా.. టీఎస్‌పీఎస్సీ రెండోసారి గ్రూప్–1 పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. పరీక్ష నిర్వహణలో లోపాలపై పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించడంతో రద్దు చేయాలని తీర్పు ఇచ్చింది. రెండోసారి సైతం గ్రూప్–1 పరీక్ష రద్దు కావడంతో ఇన్నాళ్లు వ్యయప్రయాసాలకోర్చి సిద్ధమైన యువత ఆవేదనకు గురవుతుంది. ఒకే పరీక్ష కోసం ఏళ్లకేళ్లుగా ప్రిపేర్ కావడం.. ఆర్థికంగా ఇబ్బందిగా ఉంటుందంటున్నారు. జిల్లాలో దాదాపు 2900 మంది గ్రూప్–1 పరీక్ష రాశారు. పదే.. పదే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న టీఎస్‌పీఎస్సీ బోర్డును రద్దు చేయాలని నిరుద్యోగ యువత డిమాండ్ చేస్తుంది. టీఎస్‌పీఎస్సీ నిర్లక్ష్య వైఖరి కారణంగా తమ జీవితాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోసారి గ్రూప్స్ పరీక్షలు రాయాలంటేనే భయమేస్తుందంటున్నారు. టీఎస్‌పీఎస్సీపై విశ్వాసం లేదంటున్నారు.

ఫలితం లేకుండా పోతుంది



రెండు సార్లు గ్రూప్–1 రాశాను. మొదటిసారి ప్రిలిమ్స్ పాస్ అయ్యాను. అది రద్దు చేశారు. రెండోసారి రాశాను. ఏడాదిగా కోచింగ్ కోసం హైదరాబాద్‌లో ఉంటున్న. ఇలా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇది చాలా అన్యాయం.

– పూరడి చైతన్య, సిరిసిల్ల

బోర్డు చైర్మన్‌పై కేసు పెట్టాలి



పరీక్షల నిర్వహణలో విఫలం చెందిన బోర్డును రద్దు చేయాలి. బోర్డు చైర్మన్, కమిటీ సభ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. ఒకసారి జరిగిన తప్పులను దృష్టిలో పెట్టుకుని సరిచేయాల్సిన అధికారులు మళ్లీ అవే తప్పులకు ఆస్కారం ఇవవడం నేరం. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిని క్షమించొద్దు.

– రాజు, గోపాల్‌రావుపల్లి, తంగళ్లపల్లి

క్లుప్తంగా

ఎమ్మెల్సీ కవితకు సన్మానం



ఎమ్మెల్సీ కవితను సత్కరిస్తున్న గూడూరి ప్రవీణ్, బాలరాజుయాదవ్

సిరిసిల్ల: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట కవితను తెలంగాణ పవర్ లూమ్ టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ శనివారం హైదరాబాద్‌లో కలిశారు. మహిళాబిల్లుకు ఆమోదం లభించిన సందర్భంగా కవితకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఓబీసీ రిజర్వేషన్లు సాధించేందుకు మద్దతు కోరినట్లు ప్రవీణ్ తెలిపారు. రాష్ట్ర గొర్రెల పెంపకందారుల ఫెడరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్ ఉన్నారు.

రాజన్న సేవలో ట్రెజరీ డైరెక్టర్



వేములవాడ: రాజన్నను డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ తెలంగాణ జేడీ నాగరాజు శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం వేములవాడ, సిరిసిల్ల సబ్‌ట్రెజరీ కార్యాలయాలను పరిశీలించారు. జిల్లా ట్రెజరీ అధికారి నీరజ, అసిస్టెంట్ ట్రెజరీ అధికారి చంద్రు, వేములవాడ సబ్‌ట్రెజరీ అధికారి అజహర్, ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు, ఇన్‌స్పెక్టర్ అశోక్, మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మధు మహేశ్, మామిడిపల్లి శ్రీకాంత్, ఎస్టీవో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని వెంకటాపూర్ శివారులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ముస్తాబాద్ మండలం గూడెంకు చెందిన నవకోటి శ్రీనివాస్, రాజేందర్ కలిసి బైక్‌పై సిరిసిల్లకు వెళ్లి తిరిగి వస్తుండగా వెంకటాపూర్ శివారులో అడ్డుగా వచ్చిన పాడిగేదెను తప్పించే ప్రయత్నంలో ఎగిరిపడ్డారు. రాజేందర్ తలకు గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా మారింది. క్షతగాత్రులను ప్రైవేట్ వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఉల్లాసంగా...ఉత్సాహంగా

- ముగిసిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి పోటీలు
- హాజరైన పలు పాఠశాలల విద్యార్థులు
- ఉత్సాహంగా పాల్గొన్న బాలబాలికలు



ఖోఖో ఆడుతున్న అండర్-14 బాలికలు

సిరిసిల్లఅర్బన్: గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లాస్థాయి పోటీలను మూడు రోజులుగా నిర్వహిస్తుంది. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ మినీస్టేడియంలో నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ క్రీడా మహోత్సవాలు శుక్రవారం ముగిశాయి. దాదాపు మూడేళ్ల తర్వాత ఎస్‌జీఎఫ్ క్రీడలు నిర్వహించారు. జిల్లాలోని పలు మండలాల నుంచి విద్యార్థులు భారీగా తరలివచ్చారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన అండర్ 14, 17 బాలబాలికలకు పోటీలు నిర్వహించారు. 13 మండలాల నుంచి దాదాపు 900లకు పైగా బాలబాలికలు పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో సత్తాచాటిన క్రీడాకారులను ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీలకు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



మొదటిసారి ఆడుతున్న

స్కూల్‌గేమ్స్‌లో ఆడడం ఇదే మొదటిసారి. పోటీల్లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉంది. ఎక్కడెక్కడి నుంచో విద్యార్థులు వచ్చారు. నేను కబడ్డీ, ఖోఖో పోటీల్లో పాల్గొన్నాను. – వంగ సంజన, సిరిసిల్ల



రాష్ట్రస్థాయిలో పాల్గొన్నాను

రాష్ట్రస్థాయిలో 100 మీటర్ల రన్నింగ్ పోటీలోపాల్గొన్నాను. ప్రస్తుతం ఎస్‌జీఎఫ్ నిర్వహిస్తున్న కబడ్డీ, ఖోఖో పోటీల్లో పాల్గొనేందుకు వచ్చాను. – పి.మంజుల, తంగళ్లపల్లి జెడ్పీహెచ్ఎస్



సందడిలా ఉంది

అండర్-17లో వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నాను. గతంలో నేను రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నాను. స్కూల్‌గేమ్స్‌తో నైపుణ్యాలు పెంపొందుతాయి. – ముద్రకోల అర్చన, ఎల్లారెడ్డిపేట



ఆనందంగా ఉంది

గతంలో రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొన్నాను. ఇంత మంది క్రీడాకారుల మధ్య పోటీల్లో పాల్గొనడం సంతోషంగా ఉంది. జిల్లాస్థాయి పోటీల్లో ఆడి సత్తా చాటుతాను. – నిఖిత 8వ తరగతి, మైనార్టీ గురుకులం, తంగళ్లపల్లి

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



ఎన్నిక ధ్రువీకరణపత్రాలు అందిస్తున్న మహేందర్‌రెడ్డి

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి కోరారు. ఎల్లారెడ్డిపేటలో శనివారం పార్టీ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇటీవల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన దొమ్మాటి నర్సయ్యను సన్మానించారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తల కోసం ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రతి కార్యకర్తలకు న్యాయం చేస్తామన్నారు. మండల ఉపాధ్యక్షులుగా గంట బుచ్చాగౌడ్, కొత్తపల్లి దేవయ్య, ప్రధాన కార్యదర్శులుగా దండు శ్రీనివాస్, సిరిపురం మహేందర్, కార్యదర్శులుగా బాలయ్య, ఎండీ హిమాం, కోనేటి పోచయ్య, గౌరవ సలహాదారునిగా కల్లూరి బాపురెడ్డిని ఎన్నుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హరిలాల్, నాయకులు గౌస్, లింగంగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్, బాబు, రాజునాయక్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

సిరిసిల్లఅర్బన్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినీస్టేడియంలో 9వ తెలంగాణ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ఎంపిక పోటీలు శనివారం నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ ప్రారంభించారు. అండర్ 14, 16, 18, 20 బాలబాలికలకు లాంగ్‌జంప్, పరుగు, షాట్‌పుట్, డిస్కస్‌త్రో పోటీలు నిర్వహించారు. 30 మంది క్రీడాకారులు ఎంపికవగా.. మొదటి, రెండో స్థానాల్లో నిలిచిన వారికి పతకాలు అందించారు. పీఈటీలు అజయ్‌కుమార్, సాయికృష్ణ, మహేశ్, రాజు, నవీన్, బాబు, శ్రీనివాస్, శిరీష, మహిపాల్, రవి ఉన్నారు.

విద్యార్థులకు అభినందనలు

జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి తెలంగాణ 9వ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ, ఫైన్ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఐదు గోల్డ్ మెడల్స్, ఏడు సిల్వర్ మెడల్స్ సాధించారు. వీరిని కళాశాల పిన్సిపాల్ రజినీ అభినందించారు.

రైతుల ఆర్థిక పురోగతికి 'సహకారం'

- కర్షకమిత్ర ద్వారా రుణాలు
- ఇక సహకార పెట్రోల్ బంకులన్నీ రిటైల్ బంకులే
- సహకార సంఘాల్లో కామన్ సర్వీస్ సెంటర్లు
- గోరింటాలలో రూ.3కోట్లతో రైసుమిల్లు, గోదాం
- టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు



మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): రైతుల ఆర్థిక పురోగతి కోసం సహకార సంఘాలు కృషి చేస్తున్నాయని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు పేర్కొన్నారు. గంభీరావుపేట సింగిల్‌విండో మహాజన సభ శనివారం జరిగింది. రవీందర్‌రావు మాట్లాడుతూ వాణిజ్య బ్యాంకుల మాదిరిగా సహకార సంఘాల్లో రైతులకు కర్షకమిత్ర పథకం ద్వారా రూ.10లక్షల వరకు రుణాలు అందించనున్నట్లు తెలిపారు. కేడీసీసీబీ పరిధిలోని 40 పెట్రోల్ బంకులు ఇకపై రిటైల్ బంకులుగా మారుతున్నట్లు తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వంద సహకార సంఘాల్లో మీసేవల తరహాలో కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సహకార బ్యాంకుల ద్వారా ఇప్పటికే విద్య, ఉపాధి, గృహ, వ్యాపార, వ్యవసాయ, వ్యవసాయానుబంధ పరిశ్రమలకు రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. గంభీరావుపేట సింగిల్‌విండో అప్పట్లో రూ.కోటి నష్టంలో ఉండేదని, ఇప్పుడు రూ.30కోట్ల లావాదేవీలతో లాభాల్లో ఉందన్నారు. గోరింటాలలో రూ.3కోట్లతో సహకార రైసుమిల్లు, గోదాం నిర్మించ తలపెట్టామని, వచ్చే నెలలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సెస్ డైరెక్టర్ నారాయణరావు, ఏఎంసీ చైర్మన్ హన్మంతరెడ్డి, వైస్‌చైర్మన్ లింగంయాదవ్, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ రామానుజాగౌడ్, వైస్ఎంపీపీ లత, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు అహ్మద్, మేనేజర్ సత్యంరావు, సీఈవో రాజిరెడ్డి పాల్గొన్నారు.

గ్రామ ప్రగతిభవన్ నిర్మాణానికి భూమిపూజ

గంభీరావుపేట మండలం గోరింటాలలో రూ.20లక్షలతో నిర్మించే గ్రామ ప్రగతి భవన్ నిర్మాణానికి రవీందర్‌రావు శనివారం భూమి పూజ చేశారు. ఈనెల 27న మంత్రి కేటీఆర్ మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు చేయనున్నారు. నర్మాల, కోళ్లమద్ది, గంభీరావుపేట గ్రామాల్లో మంత్రి చేతుల మీదుగా డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు పంపిణీ చేయనున్నారు.

మల్యాలలో పట్టపగలే చోరీ





దొంగతనం జరిగిన ఇంట్లో ఆధారాలు పరిశీలిస్తున్న పోలీసులు, డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు



సీసీ ఫుటేజీలో రికార్డయిన అనుమానితులు

- 7 తులాల బంగారు నగలు మాయం
- డాగ్‌స్క్వాడ్‌తో గాలింపు
- వేలిముద్రలు సేకరించిన పోలీసులు
- సీసీ ఫుటేజీల కోసం ఆరా

చందుర్తి(వేములవాడ): పట్టపగలే దొంగలు రెచ్చిపోయారు. రోడ్డును ఆనుకుని ఉన్న ఇంట్లోనే దొంగతనానికి పాల్పడ్డారు. చందుర్తి మండలం మల్యాలకు చెందిన రైతు దేశెట్టి రాజయ్య ఉదయమే పొలానికి వెళ్లగా, భార్య లక్ష్మి, కోడలు రవళితో కలిసి వేములవాడ ఆస్పత్రికి వెళ్లారు. ఇదే సమయంలో ఇంట్లోకి చొరబడ్డ గుర్తుతెలియని వ్యక్తులు బీరువాలో దాచి ఉంచిన ఏడు తులాల బంగారు నగలు ఎత్తుకెళ్లారు. భార్య లక్ష్మి, కోడలు రవళి ఇంటికొచ్చే వరకు ఇంటి తాళం పగులగొట్టి ఉండడం, బీరువాలోని బట్టలు మంచంపై పడేసి ఉండడంతో దొంగలు పడ్డారని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. చందుర్తి ఎస్సై అశోక్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. చందుర్తి సీఐ కిరణ్‌కుమార్.. డాగ్‌స్క్వాడ్‌తోపాటు ఫోరెన్సిక్ నిపుణులు తెప్పించారు. కొన్ని వేలిముద్రలను ఫోరెన్సిక్ నిపుణులు సేకరించారు.

పుట్టింటి బంగారం ధరించిక ముందే..

దేశెట్టి రాజయ్య-లక్ష్మి దంపతుల కుమారుడు రాజుకు నాలుగేళ్ల క్రితం రవళితో వివాహమైంది. రవళి తల్లిగారు పెళ్లి సమయంలో ఒప్పుకున్న ఏడు తులాల బంగారు నగలను వారం క్రితం తయారు చేయించి అప్పజెప్పారు. పుట్టింటి బంగారు నగలు ధరించకముందే దొంగల పాలు కావడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు బాధితుల బంధువుల వివరాలతోపాటు సన్నిహితంగా ఉన్న వారి వివరాలు సేకరించారు. ఇంట్లో బంగారు నగలు ఉన్నాయన్న విషయం తెలిసిన వారే దొంగతనానికి పాల్పడి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రంగంలోకి పోలీసు ప్రత్యేక బృందాలు


మండలంలో పది రోజుల వ్యవధిలో రెండు దొంగతనాలు జరగడాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. సంఘటన స్థలాన్ని సీఐ కిరణ్‌కుమార్, చందుర్తి, రుద్రంగి ఎస్సైలు అశోక్, రాజేశ్ పరిశీలించారు. సీఐ ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. దొంగతనం జరిగిన సమయంలో గ్రామంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో సీసీ కెమెరాల్లో ఏమి రికార్డు కాలేదు. దీంతో పోలీసులు జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం కలికోటలోని సీసీ ఫుటేజీలు సేకరిస్తున్నట్లు సమాచారం. నాలుగు రోజుల్లో దొంగలను పట్టుకుంటామని సీఐ ధీమా వ్యక్తం చేయడంపై.. దొంగతనానికి పాల్పడ్డ వారు చిక్కినట్లేనని తెలుస్తోంది.

సిరిసిల్లలో చాకలి ఐలమ్మ విగ్రహం




సిరిసిల్ల: జిల్లాకేంద్రంలో తెలంగాణ సామాజిక పోరాట యోధురాలు చాకలి(చిట్యాల) ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి తెలిపారు. సిరిసిల్ల పోలీస్‌స్టేషన్ ఎదుట బతుకమ్మ ఘాట్, రైతుబజారు వెళ్లే మార్గంలో విగ్రహ ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. చక్రపాణి మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ ఆదేశాలతో సిరిసిల్లలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏ ర్పాటు చేస్తూ జంక్షన్‌గా అభివృద్ధి చేస్తున్నామన్నారు. విగ్రహాన్ని నెలకొల్పేందుకు దిమ్మెను నిర్మిస్తున్నారు. రజక సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి మ్యాన రవి, నాయకులు తిరుపతి, కత్తెర వరుణ్, పంగా మధు, రజక సంఘం పట్టణ అధ్యక్షుడు దండు శ్రీనివాస్, నాయకులు వడ్నాల విక్రమ్ పాల్గొన్నారు.

ఐలమ్మ జయంతి ఉత్సవ కమిటీలో జిల్లా వాసులు



దుబ్బాక రమేశ్ వైస్‌చైర్మన్



దేవయ్య కన్వీనర్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఐలమ్మ జయంతి ఉత్సవ కమిటీ వైస్‌చైర్మన్‌గా జిల్లెల్లకు చెందిన రజక సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రమేశ్‌ను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రమేశ్‌ను జిల్లా రజక సంఘం నాయకులు అభినందించారు.

ఉత్సవ కమిటీ కన్వీనర్‌గా దేవయ్య

వేములవాడరూరల్: చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్‌గా వేములవాడ రూరల్ మండలం లింగంపల్లికి చెందిన దేవయ్యను ప్రభుత్వం నియమించింది. ఆయన నియామకానికి సహకరించిన మంత్రి కేటీఆర్‌కు, కమిటీ చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పోక్సో కేసులో ఒకరి అరెస్టు

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికను వేధించిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై శేఖర్ తెలిపారు. కొద్దిరోజులుగా బాలికను వేధిస్తున్న యువకుడిపై బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదుతో విచారణ చేపట్టినట్లు తెలిపారు. బాలికను ఇబ్బందులు పెట్టిన యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

నేడు వృద్ధులకు ఉపకరణాల పంపిణీ

సిరిసిల్లకల్చరల్: రాష్ట్రీయ వయోశ్రీ యోజన పథకం కింద వయోవృద్ధులకు సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం చేపడుతున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం తెలిపారు. వీల్ చెయిర్లు, చేతి కర్రలు, నడుము పట్టీలు, మెడ పట్టీలు, చెవిటి మిషన్లు తదితర ఉపకరణాలను గీతానగర్ హైస్కూల్‌లో ఉదయం 10 గంటలకు అందజేస్తామన్నారు. జిల్లా కేంద్రంతోపాటు తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల నుంచి ఎంపికైన లబ్ధిదారులకు సమాచారం అందించామని వివరించారు. సమాచారం అందుకున్న వృద్ధులు హాజరై కేటాయించిన ఉపకరణాలు తీసుకోవాలని, మిగిలిన మండలాల్లోని లబ్ధిదారులకు త్వరలోనే అందజేస్తామని పేర్కొన్నారు.

శ్రీవారి ప్రసాదాలకు వేలం

సిరిసిల్లటౌన్: శ్రీశాల క్షేత్ర వెంకన్న ఆలయంలో అక్టోబర్ 20 నుంచి 30 వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో మారుతీరావు ప్రకటించారు. ఉత్సవాల నిర్వహణలో భాగంగా శ్రీవారి లడ్డు, పులిహోర ప్రసాదాల విక్రయానికి, కొబ్బరిచిప్పలు పోగు చేసుకోవడానికి బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో అక్టోబర్ 4వ తేదీ ఉదయం 11 గంటలకు టెండర్లు జరుగుతాయన్నారు. ఒక్కో టెండర్‌కు రూ.10వేలు ధరావతు, వేలం షెడ్యూల్ ఫారం రూ.100 చెల్లించి పాల్గొనాలని పేర్కొన్నారు. ఈ టెండర్ అక్టోబర్ 20 నుంచి 30వ తేదీ వరకు మాత్రమే చెల్లుబాటు అవుతుందని తెలిపారు.

కాంగ్రెస్ చేనేత సెల్ అధ్యక్షుడిగా బాలరాజు



సిరిసిల్లటౌన్: చేనేత సెల్ సిరిసిల్ల పట్టణాధ్యక్షుడిగా గుడిశెట్టి బాలరాజు నియమితులయ్యారు. ఈమేరకు జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

నాగంపేటలో వ్యక్తి అదృశ్యం

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని నాగంపేటకు చెందిన నేరెళ్ల అంజయ్య అదృశ్యమైనట్లు బంధువులు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంజయ్య ఈనెల 18న పొలం వద్దకు వెళ్లొస్తానని ఇంట్లో చెప్పాడు. తిరిగి రాకపోగా, ఫోన్ స్విచాఫ్ చేసి ఉండడంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

చందుర్తి(వేములవాడ): మండలంలోని మర్రిగడ్డ-మూడపల్లి గ్రామాల మధ్య శనివారం సాయంత్రం కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. వేములవాడ అర్బన్ మండల ఎంపీపీ భర్తకు చెందిన కారు కోరుట్ల వెళ్లి వస్తుండగా ఈ సంఘటన జరిగింది. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులు సురక్షితంగా బయటపడ్డారు. సంఘటన స్థలాన్ని చందుర్తి పోలీసులు పరిశీలించారు.

దీక్షలు.. ధర్నాలు



ఆర్డీవో ఆఫీసు ముందు దీక్షాశిబిరంలో అంగన్‌వాడీలు

- నిరసనలతో అట్టుడికిన జిల్లా కేంద్రం
- కలెక్టరేట్ ముందు మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సిరిసిల్లటౌన్: ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు, మధ్యాహ్న కార్మికులు చేపట్టిన నిరసనలు హోరెత్తాయి. అంగన్‌వాడీలు ఆర్డీవో ఆఫీసు ముందు నిరసన తెలపగా.. మధ్యాహ్నం కార్మికులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు.

సర్కారు నిర్లక్ష్యం వీడాలి

సమస్యలు పరిష్కరించాలని ఆర్డీవో ఆఫీస్ ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన నిరసన దీక్షలు శనివారం నాటికి 14వ రోజుకు చేరాయి. తమ సమ్మెను విచ్ఛిన్నం చేసేలా అధికారులు కుట్రలు పన్నుతున్నారన్నారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. దీక్షలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు కల్లూరి చందన, ఎదురుగట్ల మమత తదితరులు ఉన్నారు.

పర్మినెంట్ చేయండి

పర్మినెంట్ చేయాలని మధ్యాహ్న భోజన కార్మికులు శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ ఇన్నాళ్లుగా వెట్టిచాకిరి చేస్తున్నామన్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఈమేరకు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. ఏఐటీయూసీ నాయకులు, మధ్యాహ్న భోజన కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్లతో ఉపాధి పొందాలి

- జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు



మొక్కలు నాటుతున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మరుగుజ్జు తాటిచెట్ల పెంపకానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గీతకార్మికులు ఉపాధి పొందాలని జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక కోరారు. మండలంలోని రాచర్ల గొల్లపల్లిలో శనివారం స్థానిక ఎల్లమ్మ గుడి వద్ద మరుగుజ్జు తాటి మొక్కలు నాటారు. ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్‌కుమార్, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సర్పంచ్ పాశం సరోజన, నాయకులు అందె సుభాష్, కొండ రమేశ్, తీగల ప్రకాశ్, దత్తాద్రిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.